# ప్రయాణంలో ప్రణయం

-ఠ.ఎస్.నారాయణ

నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ఇంకో అర నిముషానికో, నిముషానికో బయల్దేరుతుందనగా పరుగెత్తు కుంటూ వచ్చి తన బెర్త్ రిజర్వు అయిన పెట్టెలోకి ఎక్కాడు సారధి. అతడు ఎక్కడమేమిటి, గార్డు విజిల్ వేయటమేమిటి- ఆపైన డ్రైవర్‌బాబు యింజన్ చేత ఓ కూత కూయించి బండిని ముందుకు లాగించటమేమిటీ అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.

''బాబోయ్! హైదరాబాద్ కూడా కలకత్తాను మించి పోతోంది...రైలు బయల్దేరే సమయానికి రెండు గంటల ముందైనా యింటి దగ్గర బయల్దేరకపోతే ఇంతే సంగ తులు. తను వయస్సులో వున్నవాడు, చేతిలో బ్రీఫ్ తప్పా మరేదీలేని వాడు అవ్వటంతో ఈ రైలు ఎక్కగలి గాడు. ఆటోలో వస్తేనేం, ఆర్టీసీ బస్సులో వస్తేనేం-కట్ట డంలో వున్న పై ఓవర్లను దాటేటప్పటికి పుణ్యకాలం కాస్తా ఇట్టే గడిచిపోతుంది'- అనుకున్నాడు.

నుదుట పట్టిన చెమటను తుడుచుకుంటూ, ముప్పై మూడో నెంబరు బెర్తుకోసరం వెతుక్కుంటూ ముందుకు అడుగులు వేశాడు. అప్పటికే చాలామంది మధ్య బెర్త్‌ను దించేసి కాళ్ళు బార జాపుకు పడుకున్నారు. మధ్యవాడు పడకెక్కితే క్రిందవాడూ-పైవాడూ చేసేదేమున్నది-బుద్ధి మంతుల్లా వాళ్ళూ దుప్పట్లు బిగించేయటమే హాయి!

తన నెంబరు దొరికింది. తన అదృష్టం-తన నెత్తి మీద వాడు ఇంకా బెర్తు దించలేదు-అనుకుంటూ బ్రీఫ్‌ను క్రింద బెర్తుమీద కిటికీ పక్కగా పెట్టి అవతల క్రింద బెర్తుమీద ఎవరా అన్నట్లుగా తలెత్తి చూచాడు.

అతడి కళ్ళు విశాలమయి, నుదురు ముడిపడింది. కాస్త ఖంగారు పడ్డట్లుగా అటూ యిటూ కదిలాడు.

అక్కడ ఓ అమ్మాయి కూర్చొని వున్నది. అప్పటికే ఓ వారపత్రికలో తలదూర్చేసి తన పరిసరాలనే మర్చిపోయిన ట్లుగా కళ్ళను సగం వాల్చి పఠనంలో పడిపోయింది.

ఆ అమ్మాయి తలెత్తేలోగానే ఆ పెట్టె నుండి దిగిపో దామనుకున్నాడు ఒక్కక్షణం..కానీ ఎక్కడికి వెళతాడు?

అయినా తనకేం భయం..మొగవాడు..ఏమైనా చేయగలడు..ఏమైనా మాట్లాడగలడు-అన్న అహం అతడిని అక్కడే కూర్చునేలా చేసింది. సీటులో హాయిగా కూర్చొని చల్లగాలి వీస్తుండటంతో, కిటికీ అద్దాన్ని క్రిందకు దించాడు.

అలా కిటికీ దించుతున్న శబ్దానికే ఒక్కసారి ఆ అమ్మాయి తలెత్తి సారధిని చూచింది. కళ్ళు విశాలం చేసుకు చూచింది. కళ్ళు చికిలించి చూసింది. ఒక్క క్షణం కళ్ళు మూసుకు ఆలోచించింది. ఈ శాల్తీని ఇంత కుముందు ఎక్కడో ఎన్నడో చూచానన్నట్లుగా.

కళ్ళు మూసుకు గతంలోకి వెళ్ళినప్పుడే బుర్రలో దీపం వెలిగింది. ఓహో ఆ అబ్బాయిగారే ఈ అబ్బాయి గారు అనిపించగా-మూతి ముడుచుకొని, ఒకసారి అటు యిటూ సర్దుకొని పుస్తకంలోని అక్షరాల వెంట కళ్ళను పరుగెత్తించసాగింది.

పీడాపోయింది-ఈ అమ్మడు నన్ను గుర్తించలేదులే అన్నట్లుగా సారధి ఒకసారి తలఎగరేసి-తనూ ఏదైనా పుస్తకం చదువుకుంటూ కూర్చుందామనిపిస్తున్నా-తెచ్చు కోని పుస్తకం మీద కాస్త విసుక్కొని-మళ్ళీ లేచి నిల్చొని, ''బెర్త్‌ను పైకెత్తుదామా మాస్టారూ-పదిన్నర అవుతు న్నది!'' అన్నాడు పక్కన కూర్చొని దిక్కులు చూస్తున్న ప్రయాణీకుడితో.

సారధి పదిన్నర అవుతున్నది అని అంటున్నప్పుడే ఆ అమ్మడు కూడా చేతి గడియారం వంక ఒకసారి చూచుకొని--తనూ లేచి నిలబడింది..తన నెత్తిమీదకు కూడా బెర్త్‌ను ఎత్తేసుకుందాం అన్నట్టుగా.

-తనలో ఏం లోపం వున్నదని అతగాడు తనని నిరాకరించాడు ఓ పట్టు పట్టేటందుకు నాందిగా మాటకలిపింది-పదుహేను రోజుల క్రితపు పెళ్ళి చూపుల సీనును కళ్ళ ముందు కదిలించుకుంటూ.

రెండువైపులా పై బెర్తుల మీద వాళ్ళు ఎప్పుడో మూడంకె వేసేశారు. మధ్య బెర్త్ పెద్ద మనిషి పైకెక్కగానే కాస్త తలవంచి వంగొని ఆపైన నడుంవాల్చి, తలక్రింద నల్లటి హ్యాండ్ బ్యాగ్‌ను దిండులా పెట్టుకొని-

''మాస్టారూ! మీరు పడుకోబోయేముందు కాస్త లైటార్పండి!'' అన్నది సారధితో మాట కలుపుతూ.

-తనలో ఏం లోపం వున్నదని అతగాడు తనని నిరా కరించాడు ఓ పట్టు పట్టేటందుకు నాందిగా మాటకలి పింది-పదుహేను రోజులక్రితపు పెళ్ళి చూపుల సీనును కళ్ళముందు కదిలించుకుంటూ.

-శుభ్రంగా స్వీటు లాగించారు. హాట్ ప్యాక్‌లో నుంచి తీసిన ఉల్లిపాయ పెసరట్లను ఆవురావురు మంటూ తిన్నారు. కాఫీలు త్రాగారు. వక్కపొడి వేసుకు న్నారు. తనకు పాటలొచ్చా అని ఈ అబ్బాయిగారి అమ్మ గారు ఓ కులుకు కులికింది. నాకు వంట తప్పా ఇంకేమీ రాదండీ అన్నది తను. ఉద్యోగం చేస్తారా దొరికితే అని ఈయనగారు డబ్బు మీద ప్రేమను వ్యక్తపరిచారు-మా అమ్మా నాన్నలకు నేనొక్కదాన్నే కూతురిని..ఎప్పుడూ ఆ విషయం ఆలోచించలేదండీ అన్నది తను. మా పెద్దకో డలు తెల్లటి తెలుపండీ అని ఆమె గర్వంగా అంటే-నా ఈ ఎలికతోలు ఎంత ఉతికినా నలుపు నలుపేగాని తెలు పురాదు-మరెక్కడైనా తెల్లతోలు దొరుకుతుందేమో వెతు క్కోండి అని అందామనుకొని-మల్లెపూలు నేను పెట్టు కుంటేనే అందంగా మెరిసిపోతుంటయి అన్నట్లుగా ఒక్క సారి పొడుగాటి జడను ముందుకు లాగి బుజం మీదుగా పడ్డ మూరెడు మల్లెదండనూ మెడ తిప్పి వాసన చూసి వదిలేసింది. అబ్బాయిగారి నాన్నగారు కూడా కాస్తన్ని చిత్రికపట్టేవారేమోగాని..ఆ అదృష్టం తనకు లేదన్నట్లుగా ఎప్పుడో పైకి వెళ్ళిపోయాడు!

త్వరలోనే తెలియబరుస్తాం అంటూ ఆ గదిని-తాము ఖాళీ చేసిన టిఫెన్ ప్లేట్లలా వదిలేసి వెళుతున్న ప్పుడు-మీరేం చెబుతారో నాకు తెలుసులే-ఈ మహాను భావుడు నన్ను చూచిన పదమూడో వాడు-అనుకుంటూ వెనక్కు తిరిగింది తను.

క్షణం నవ్వు వచ్చింది జయంతికి-నల్లటి వాళ్ళు తెల్లటి వాళ్ళకు పెళ్ళాలుగా పనికిరారా అన్నట్లుగా!

తరువాత అనుకున్నట్లుగానే తండ్రి పద్నాలుగో వాడి కోసరం చెప్పులు అరగదీయటం మొదలుపెట్టాడు.

ఆస్థాన జ్యోతిష్కుల వారు తనకు పెళ్ళి అవసరమే మిటో అర్ధంగాని వయస్సులో వుండగానే ఒకసారి భూత ద్దాలను ముక్కుమీద సర్దుకుంటూ తన జాతకం చూసి-''ఏం మహర్దశ..ఏం మహర్దశ..ఆరడుగుల పొడు వువాడు, బంగారు రంగు వాడు గిరజాల జుట్టువాడు, బారెడు మీసాల వాడు మొగుడవుతాడ''ని చెప్పాడు. తను ముసి ముసి నవ్వులు చిందించింది.

ఇప్పుడు ''మహాశయా! నా రాకుమారుడెక్కడ?'' అని నిలవేద్దామన్నా మొదటివాడు తనింట్లో టిఫెన్ ప్లేట్లు ఖాళీ చేయకముందే ఆయనగారు బక్కెట్టును తన్నే శారు.

''మీ అమ్మగారు బాగున్నారా?'' మొఖం సారధివై పుకు తిప్పి రెండో మాటగా అడిగింది.

''ఎవరు..ఎవరు?'' అంటూ-తన గుట్టు కాస్తా తెలి సిపోయిందన్నట్టుగా తడబడ్డాడు అతడు.

''నన్ను గుర్తుపట్టలేదేమిటి?'' అన్నది నోరంతా విశాలం చేసుకొని పళ్ళన్నీ చిగుళ్ళతో సహా బయటకు పెట్టి నవ్వుతూ జయంతి.

''గుర్తుపట్టాను-పట్టలేదు' అని నసుగుతున్నట్లుగా తలను ఉయ్యాలలా ఊపాడు.

''నేను రంగనాధంగారి అమ్మాయినండీ!..పదిహేను రోజుల క్రితం మా యింటికి వచ్చారుగదా! మీరూ మీ అమ్మగారూ!'' అన్నది కవ్విస్తున్నట్లుగా.

అతడు అప్పుడే గుర్తు పట్టి నట్టుగా ఉలిక్కి పడి-లేచి కూర్చో బోతూ పై బెర్తుకు తలకాయ ఠపీమని తగిలి 'అబ్బా' అన్నాడు.

ఇంకెక్కడి అబ్బ-అమ్మా అనక..నవ్వుకుంది మనస్సులోనే.

''అయ్యో'' అన్నది లోపల అనుకున్నదానికి పర్యాయపదంగా.

''నల్లగొండ దాకా ఈ రైలు ఆగ దుగదండీ!'' అన్నాడు ఏం మాట్లాడాలో తెలి యనట్లుగా.

''ఏమిటి మధ్యలోనే దిగాలా మీరు..అరె! బీబీన గరు వెళ్ళిపో యిందే..ఇంకెక్కడా ఆగదుమరి!'' ఎంత నిగ్రహించు కున్నా ఆ మాటల్లో ఎగతాళిపాలును దాచుకోలేకపో యింది.

''అదేం కాదు...ఊరికినే అడిగాను..టైమెం తైందోనని!''

అది అర్థంలేని సంభాషణ అని పించి-మళ్ళీ అత డిని దారిలో పెట్టాలి అన్నట్లుగా, ''ఇంతకీ ఏదైనా సంబంధాన్ని నిశ్చ యించుకున్నారా లేదా?'' అన్నది.

''ఏదీ..మా అమ్మకు నచ్చాలిగదండీ!'' అన్నాడు సారధి నసుగుతున్నట్లుగా.

-ఇంకా ఈ కాలంలో కూడా మొగుడితో కాకుండా, అత్తలతోటే కాపురాలు చేసే కోడళ్ళు వున్నారా అనిపిం చింది జయంతికి. చిన్నగా నవ్వేసి ఊరుకున్నది-ఏమైనా అంటే అతగాడు బాధపడతాడేమోనన్నట్లుగా.



అతడికి అమ్మంటే వల్లమాలిన ప్రేమ అనిపించింది.

''మా నాన్న నా చిన్నప్పుడే పోతే..మా అమ్మే నన్ను అమ్మా నాన్నా అయి పెంచిందండీ..అందుకే ఏ నిర్ణయ మైనా ఆమే తీసుకోవాలి!'' అన్నాడు జయంతిని నిరాక రించటంలో తన తప్పేమీ లేదన్నట్లుగా.

''నాకూ పెద్దలకు అలా గౌరవం ఇవ్వటమంటేనే ఇష్టమండీ!'' అన్నది బుద్ధిమంతురాలిలా బుంగమూతి పెట్టి అతడినే చూస్తూ.

రైలు పెట్టెలు ఊగేలా అతివేగంగా పోతున్నది. నల్లగొండ వరకూ అది ఆగే అవ సరం లేదు.

''ఆమెకేమిటో పెద్దకోడల్లా చిన్నకో డలూ అదే రంగులో ఉండాలని!''

''పాపం నిజమే నండి!'' అన్నది నీర సంగా. ''ఒకింట్లోనే ఒకళ్ళు కలిగి తురాయి మరొకరు మకిలిపట్టిన దీపపు సెమ్మె అయితే నలు గురూ నవ్వరూ!''

సారధికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ''హిహి'' అని ఊరుకున్నాడు.

-అతడేం పెద్ద జాంపండు గాదు. పిసరంత ఎరుపు. చీకట్లో తామిద్దరూ పక్కన పక్కన నిల్చుంచే చూచేవా ళ్ళకు ఓ పావు క్షణం ముందు అతడు కన బడతాడు. ఆపైన తను కనబడుతుంది. ఇంతోటిదానికి మేలిమి బంగారపు రంగు పిల్ల కావాలంటే-నిజమే కావాలేమో!

ఎవరి కోరికలు వారివి!

తండ్రి అంటుండే వాడు-'నీకేమి టమ్మా..కృష్ణుడు నలుపు కాదా..సావిత్రి నలుపుకాదా..అంతదాకా ఎందుకు..మీ అత్తయ్య ఎంత నలుపు..అమెరికా వెళ్ళి ఆరునెలల్లో పచ్చటి పసుపు వెలా తెలా బోయేలా రంగు మార్చుకురాలేదా..అసలు వంటి మీద నేను దిగేసే వంద తులాల బంగారానికి వన్నె తెచ్చేది నీ మొఖంలోని రంగేకదమ్మా!..నీకు తెలుసో తెలి యదో ఇండియాలో వున్న తొంభైకోట్ల జనంలో పాతిక కోట్ల జనం నీకంటే నలుపు..నీకున్న కళ్ళు తొంభైవేలమం దికైనా వున్నయ్యా అని నా అనుమానం!'' అని దగ్గర

కూర్చొని తల నిమురుతూ చెబుతుంటే తన కెంతో గర్వంగా వుండేది చిన్నప్పుడు.

అప్పుడు ఎంత గర్వపడితేనేం- ఇప్పటికి పది ముగ్గురి ముందు తన భవిష్యత్తు తుస్సు మన్నది.

క్షణం బాధేసింది జయంతికి.

ఆపైన ఎదురుగ్గా వున్న సారధి మీద చర్రున కోపమొచ్చింది- నోరు తెరిచి సరిగ్గా మాట్లాడలేడు..మూగి మొద్దులా ప్రతిదానికీ తలకాయ ఊపుతుంటాడు- చేస్తున్నది ఆఫీ సరుగిరీ అవ్వవచ్చు- తనతో కాపురం చేయా ల్సిన పెళ్ళాన్ని కూడా తల్లే ఎన్నిక చేయాల నుకుంటే ఎలా? మొగవాడికి మీసమెంత అందమో స్వయం నిర్ణయశక్తి కూడా అంతే అందంగా వుంటుంది. అది లేని అతడిని పట్టుకొని నాలుగు పీకాలనిపించింది.

కానీ నిగ్రహించుకొని- ఎవరి ఆలోచనలు వారివి. తానెందుకు తన ఆలోచనలనూ, అభిప్రాయాలనూ మరొ కరి నెత్తిన రుద్దాలి అన్నట్లుగా- ఆ కోపాన్ని గుటుక్కున మింగేసి ఓ చిన్ననవ్వు నవ్వింది.

''పెద్దలు ఊరికినే అనరులేండి- వివాహాలు స్వర్గం లోనే అవుతయ్యని!''

అతడు మామూలుగా తల ఊపాడు.

''అక్కడ మనకు గ్రీన్ కార్డు లభించలేదన్నమాట!'' అతడిని ఆమె వదిలిపెట్టకుండా రెట్టిస్తున్న ఆ సంభాషణ చాలా చికాకు కలిగిస్తోంది. ఒక్కక్షణం అనిపించింది కూడా తనని ఏడిపించటానికే ఆమె అలా సాగదీస్తున్నదా అని!

''నాకు నిద్రవస్తున్నదండీ!'' అన్నాడు- ఇక తమరు నోరుమూసుకుంటారా అన్నట్లుగా.

అతడి భావం అర్ధమయి చర్రున మరోసారి కోపమొ చ్చింది జయంతికి.

''అంటే నేను మీ నిద్రను చెడగొడుతున్నాననా మీ ఉద్దేశ్యం!'' అన్నది సగం తలెత్తి- పక్కన పడేసిన పుస్త కాన్ని చేతిలోకి తీసుకుంటూ.

అతడు తడబడ్డాడు.

''అబ్బెబ్బె..నేను అలా అనుకోలేదండి!''


అతడి ఖంగారుకు ఎగతాళిగా నవ్వుకున్నది.

''లైటేయండి..నేను చదువుకోవాలి'' అన్నది దబా యిస్తున్నట్లుగా.

అతడు మోచేతి మీద లేవబోయి, మళ్ళీ నెత్తికి పై బెర్త్ ఎక్కడ కొట్టుకుంటుందో అన్నట్లుగా, నెత్తిన చేయి పెట్టుకొని వేలి స్విచ్ నొక్కాడు.

జయంతి నవ్వు బిగపట్టుకుంటూ, మనస్సును కుదురుగా నిలబెట్టుకోలేకపోయినా కళ్ళను అక్షరాల వెంట పరుగెత్తిస్తోంది.

గడియారం చూచుకున్నది. పదకొండుపైన నలభై నిముషాలయింది. టైం చూస్తుండగానే పిడుగుపడ్డట్లుగా పెద్ద శబ్దమయింది. ఆపైన భూకంపమొచ్చినట్లు పెట్టి




అటూ యిటూ ఊగిపోసాగింది. దీపాలారిపోయినయి. చిమ్మచీకటి.

పెట్టె ఒక్క కుదుపు కుదపటంతో బెర్త్ మీద నుంచీ క్రిందకు దొర్లింది.

ఏదో అర్థమయినదానిలా క్షణం కూడా ఆలోచించ కుండా ఎదురు బెర్త్ మీద పడుకున్న సారధిని తనవైపుకు ఒక్క గుంజు గుంజింది. బలంగా గుంజటంతో అతడు మీదే పడ్డంత పని చేశాడు.

అప్పటికే రైలు పెట్టె ఓ పల్టీ కొట్టేసింది. మధ్య బెర్త్ గొలుసులు ఊడినట్టున్నయి కొన్ని బెర్త్‌లు పెద్దగా శబ్దం చేస్తూ వాలిపోయినయి. ఆ బెర్తులు మీద పడుకున్న వాళ్ళు చాపచుట్టల్లా క్రిందకు దొర్లి పోయారు కేకలు పెడుతూ.

గోల..కేకలు..అరుపులు..ఏడుపుల..ఫెళాఫెళా శబ్దాలు..పెట్టెలమీద చేతులతోనూ, కాళ్ళతోనూ బాదు తున్న చప్పుళ్ళు..

ఓ పల్టీకొట్టిన వాళ్ళ భోగి మళ్ళీ నేలమీద నిలబ డిందా అన్నట్లుగా స్థిమితంగా ఓ వైపుకు కొద్దిగా వాలి వున్నది.

అందరిలోనూ ఊహించలేనంత భయం..

''ఏమైంది..ఏమైంది..గగ్గోలు..అమ్మా..అబ్బా..నాయ ఎనా'' భయంతోనూ, బాధతోనూ ఆక్రందనలు.

''మీరు లేస్తే నేను లేస్తాను!'' గొంతు బిగుసుకు పోయి మూలుగుతున్నట్లుగా అన్నది జయంతి.

''ఎలా..ఎలా..నా వక కాలూ చేయి పెట్టెలక్రిందపడి నలిగిపోతున్నాయి..నడుం మీద కూడా కదిలించటానికి వీల్లేకుండా ఏదో బరువు పడినట్లున్నది!''

''ఎలాగోఅలాగ ముందు లేవండి..నేను క్రింద అణి గిపోతున్నాను!'' విసురుగా అన్నది.

కాలిని బలంగా లాగాడు. చేతిని బలంగా లాగాడు. వాటికి ఏదో గీచుకొని మండిపోతున్నాయి. పట్టుకుపో యిన మోకాళ్ళమీద చేతులు వేసి కొద్దిగా నడుమెత్తి వెనక్కు ఒక్క ఊపు ఊపాడు..మీద వున్న బరువు వెనక్కు జారేలా..చిన్నగా లేచి చీకట్లో తడుముకుంటూ తన సీటు మీద కూర్చున్నాడు.

జయంతీ లేచింది. ఆ చీకట్లో వంటి మీద గుడ్డలు సరిగ్గా వున్నయ్యో లేదో గూడా చూచుకో లేదు. సారధి పక్కగా సీటుమీద కూర్చుంటూ, దడదడలాడుతున్న గుండెల మీద చేయి వేసుకుంటే అప్పుడు తెలిసింది పమిట లేదని. తడబ డుతూ ఆ చీకట్లో నాలుగువైపులా తడు ముకొని జారిపోయిన చీరెను పట్టుకొని బుజం నిండా కప్పుకున్నది.

ఓ నిముషం పాటు యిద్దరూ మాటలు కరువవ్వగా శిలలే అయ్యారు.

తోటి ప్రయాణికుల ఏడుపులూ మూలుగులూ వింటూ స్మశానంలోలా భయంతో బిగుసుకుపోయి కూర్చున్నారు.

''ఏం చేద్దాం?'' అన్నది ముందుగా కోలుకున్న జయంతే.

''ఏం చేయాలి?'' అన్నాడు అయోమయంగా ఆ చీకటినే చూస్తూ సారధి. ఒక కాలూ చేయీ మండిపోతు న్నది. నెత్తురుకారుతున్నట్లుగా తడితడిగా వున్నది.

ఆమె ఆ చీకట్లో అతడి మాటకు ఓ చచ్చి బ్రతికిన నవ్వు నవ్వింది.

''లేవండి..లేచి..ఈ చీకట్లో తడుముకుంటూ తిన్నగా క్రిందపడివున్న ఎవరి గొంతుమీదా కాలేయ కుండా బయటపడాలి. తలుపు దగ్గరకు వెళితేగాని మనం ఎక్కడున్నామో మనకు తెలియదు''

అతడు వణుకుతూనే లేచి నిలబడ్డాడు. లేస్తే కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. చేయెత్తి పై బెర్త్‌ను పట్టుకు న్నాడు. తన మీద వున్న మధ్య బెర్త్ ఏమైందో కనబడ లేదు. చటుక్కున వంగొని చూచాడు. అది వాలిపోయి వున్నది.

అంటే-

ఆమె తనని క్రిందకు లాగకపోతే..

-తలపగిలి, ఒళ్ళు పచ్చడయి చచ్చివుండేవాడు!

మరోసారి- అలా అనుకోవటంతోటే- మైకం కమ్మింది. తూలిపోతూ నెత్తిన రెండు చేతులూ పెట్టుకొని మళ్ళీ ఆ సీటు మీద కూలబడిపోయాడు.

ఆ భయంలో కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగినయి.

''ఏమైంది?'' అన్నది అతడు మళ్ళీ కూర్చోవటం గమనించి.

''కళ్ళు తిరుగుతున్నాయి!''

''ఇంకా ఇక్కడ కూర్చుంటే ప్రాణాలు కూడా పోవచ్చు..బయట పడాలి వెంటనే..లేవండి!'' అన్నది పెద్దగా.

అతడు ఒక్కసారి గట్టిగా కళ్ళు మూసుకు తెరిచి లేచి నిలబడ్డాడు.

''పట్టుకునేదా?'' అన్నది చిన్నగా నవ్వి.

''అఖ్ఖర్లేదు!''

కాటుకలాంటి నల్లటి ఆ చీకట్లో కాళ్ళను నేలమీద రాచుకుంటూ- మనుష్యులు గాని, వస్తువులుగాని తగిలి పడతామేమో అన్నంత జాగ్రత్తగా- ముందుకు జరగసా

గారు.

ఓ పక్కగా తెరిచి వున్న తలుపుగుండా-లోపలికి వస్తున్న సన్నపాటి వెలుగులోంచి-జనం క్రిందకు దూకుతున్నట్లనిపించగా యిద్దరూ అటువైపు నడిచారు.

వెనక, ముందు ఏడుపులు..

భయంకరంగా వున్న ఆ వాతావరణంలో నుంచి ఎంత తొందరగా బయట పడాలన్నా-కాలికి ఏదో ఒకటి మెత్తగానో, గట్టిగానో ఆ చీకటిలో తగులుతూ ప్రతి క్షణం ప్రతిబంధకమే అవుతున్నది.

తలుపు దగ్గరకు వెళ్ళటానికే పది నిముషాలు పట్టింది. అక్కడకు వెళ్ళి క్రిందకు చూచిన సారథి, "నేలకు చాలా ఎత్తులో వున్నాం!" అన్నాడు.

"క్రింద నీళ్ళు గనుక లేకపోతే సంతోషంగా దూకేయండి!"

అతడు తలుపు పక్క రాడ్ పట్టుకొని చివరి మెట్టు మీద దాకా చిన్నగా దిగి అక్కడి నుంచి దూకాడు. ఆమె అతడిని అనుసరించింది.

అప్పటికే రైలు దిగిన చాలామంది జనం ఆ చీకట్లో అటూ యిటూ-ఒడ్డున పడ్డ చేపల్లా గిలగిలలాడుతూ-పరుగెడుతున్నారు.

ఇద్దరూ చిన్నగా అడుగులు వేస్తూ ముళ్ళ కంపల మధ్య కాళ్ళు పెట్టారు. అప్పటికిగాని తెలియలేదు వాళ్ళకు-కాళ్ళకు చెప్పులు కూడా లేవని!

అదే అన్నాడు అతడు. "చెప్పుల కోసరం అక్కడకు వెళితే-అవి కనబడ్డా కనబడకపోయినా-మళ్ళీ తిరిగి దిగగలుగుతామో లేదో!" అన్నది ఎగతాళిగా.

ఇద్దరూ విరిగిన చెట్ల కొమ్మలనడుమగా చిన్నగా దారి చూచుకుంటూ, జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ రైలు కట్ట ఎక్కారు.

ఇంకా కొన్ని పెట్టెలు, ఇంజనూ ముందు పట్టాల మీద వున్నాయి.

దూరంగా వెలుగుతున్న నల్లగొండ దీపాలు..

అక్కడకు మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలో వుంటుంది వూరు.

"ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు-ఏడుపు ఆపుకుంటున్నట్లు గొంతునొక్కుకు పోతుండగా.

అతడికి కాళ్ళమీదా చేతులమీదా బాగా గీరుకుపోయి నెత్తురు కారుతూ మంట పుడుతోంది.

"నడవండి..ఊళ్ళోకి వెళ్దాం!"

"నా పెట్టె!.." అన్నాడు.

"పీడాపోయింది..ఆ బరువు కూడా ఎవరు మోస్తారు..తెల్లవారుతూనే వద్దాంలేండి! నా సంచీకూడా వున్నదిగదా!"

దగ్గర్లో వున్న రోడ్డు మీద పోతున్న కార్లు, లారీలు, బస్సులు ఆగిపోతున్నాయి.

పెట్టెలో వున్న భయంకరమైన చీకటి నుండి బయటకు వచ్చిన తరువాత బయట వున్న కొద్ది వెలుగు-వెయ్యి కాండిల్స్ బలుబు వెలుగులా అనిపిస్తోంది వాళ్ళకు. చకచకా నడుస్తున్నారు.

"నల్గొండలో మా బాబాయిగారున్నారు..ముందు అక్కడకు వెళ్దాం!"

అతడు తల ఊపాడు.

"మధ్య బెర్త్ నామీద పడితే ఏమయ్యేది?"

ఆమెకు నవ్వు వచ్చింది అతడి మాటలకు. వెక్కిరిస్తున్నట్లుగా, "ఇన్నాళ్ళూ అమ్మ దగ్గర వున్నారు గదా..ఇక నాన్నదగ్గర వుండే వాళ్ళు!" అన్నది.

అతడు ఆగిపోయి ఆమెనే భయం భయంగా చూడసాగాడు.

"నడవండి..నడవండి..ఏమీ అవ్వలేదుగదా!"

ఆడమనిషి అయినా ఆమె తనని బ్రతికించటమే గాకుండా అంత ధైర్యంగా ఎలా వున్నదో అతడికి అర్థం కాలేదు!

ఇద్దరూ ఫర్లాంగు దూరంలో వున్న రోడ్డెక్కారు.

లారీలలో నుంచి, బస్సుల్లోనుంచి దిగిన జనం అడ్డంపడి పడ్డ రైలు దగ్గరకు పరుగెడుతున్నారు.

అటువైపు నుంచీ వచ్చిన వీళ్ళద్దర్నీ చూస్తూనే చాలా మంది వీళ్ళ చుట్టూ మూగారు.

"మీరు రైలు ప్రయాణీకులా?"

"అవునండీ!" జయంతి అన్నది.

"ఎంతమంది చచ్చిపోయారండీ!"

"అబ్బ ఎంత మృదువుగా అడిగావురా నాయినా" అనుకున్నది జయంతి.

"దీపాలు లేవుగదండీ..లెక్క వేయలేదు మేము!" విసురుగా అన్నది.

ఓ పెద్దాయన ముందుకు వచ్చాడు. "ఏమైనా సాయం కావాలా..హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళమంటారా..మేం నల్గొండ వైపు వెళ్తున్నాం!"

"థాంక్యూ..క్లాక్‌టవర్ దగ్గర మమ్మల్ని డ్రాప్ చేయగలరా?" అంటూనే ఆయన వైపుకు నడిచింది జయంతి. సారథి అనుసరించాడు.

యిద్దరూ కారెక్కారు. అది అతి రయంగా ముందుకు దూసుకుపోయింది. నిశ్శబ్దంగా వున్న నల్లగొండ వీధుల్లో నుంచి పోయి క్లాక్ టవర్ దగ్గర ఆగింది.

"మీరు వెళ్ళవలసిన ఇల్లెక్కడో చెప్పండి!" కారు నడుపుతున్న ఆయనే అడిగాడు. "అక్కడ డ్రాప్ చేస్తాను!"

"ఫరవాలేదండి..మేం వెళ్ళగలం..ఇక్కడే రామ్‌గిరిలోనే ఇల్లు..థాంక్స్యూ వెరీమచ్!"

కారు వెళ్ళిపోయింది.

నిర్మానుష్యమయిన రోడ్ల మీద దీపాలు వెలుగుతున్నాయి. చల్లగా వున్న వాతావరణం. అప్పుడప్పుడూ కుక్కల అరుపులు..

ఇద్దరూ పక్కన పక్కనే నడుస్తున్నారు.

"మీరు నన్ను క్రిందకు గుంజకపోతే.." అతడు ఏదో చెప్పబోతున్నాడు.

"ఈ రైలు పడకపోతే మనం ఈపాటికి మిర్యాలగూడా కూడా దాటి వుండే వాళ్ళం!" ఆమె ఫక్కున నవ్వింది.

-ఆమె అలాంటి భయంకర స్థితిలో కూడా ఎలా నవ్వగలుగుతున్నదో అతడికి అర్థం కాలేదు. అతడి గుండె దడ రైలు పడి గంట గడిచినా ఇంకా తగ్గలేదు..ఆ చల్లటి వాతావరణంలో కూడా ఇంకా అతడి వంటిని చెమటలు పట్టటం తగ్గనే లేదు.

ఆమె పక్కన నడుస్తున్న అతడు ఉన్నట్లుండి చటుక్కున ఆమె చేయిపట్టుకొని, "నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను!" అన్నాడు ఆవేశంతో వణికిపోతూ.

జయంతి తలెత్తి రోడ్డు మీది దీపాల వెలుగులో కళ్ళు మూసుకొని వున్న అతడి మొఖంలోకి చూచింది వింతగా. అతడు ఉలిక్కిపడి కళ్ళు తెరిచేలా ఫెళఫెళా నవ్వుతూ, "ఏమంటున్నారు?" అన్నది.

"మీరు బ్రతికించుకున్న నా ఈ జీవితం ఇక నుంచి మీదే!" అతడు మరేదో లోకంలో వున్నట్లుగా తన్మయంగా అంటున్నాడు.

ఆమె క్షణం కూడా ఆలశ్యం చేయలేదు. తన చేతిని పట్టుకున్న అతడి చేతిని చిన్నగా విడిపించుకుంటూ, "నేను మీ ప్రాణాన్ని కాపాడటానికి వెచ్చించింది ఒక్క క్షణమే..కానీ మీరు-నేను నా జీవితపు నందనోద్యానవనంలో నయన తారలా వెలిగిపోవటానికి కొన్ని పదుల సంవత్సరాలు చేయూత నివ్వవలసి వుంటుంది-వేడి మీద నిర్ణయాలు ఆ వేడి చల్లారిపోయిన తరువాత చాలా రసహీనంగా వుంటయి-అందుకని ఆరునెలల తరువాత-అప్పటికీ ఈ విషయంలో మీ నిర్ణయం మారకుండా వుంటే-మీ అమ్మగారిని మా యింటికి పంపండి...పదండి..పదండి..అదుగో ఆ ఎత్తుమెట్ల ఇల్లే మా బాబాయిగారిల్లు!" వడివడిగా ముందుకు అడుగులు వేయసాగింది జయంతి.

★

